సత్ఫలితాల బడిబాట

కలిసొచ్చిన అవగాహన కార్యక్రమాలు.. రాజ్‌భవన్ పాఠశాలకు అడ్మిషన్ల తాకిడి

- ఇదివరకే దత్తత ఆపై సదుపాయాలు, ప్రత్యేక టీచర్ల నియామకం
- బేగంపేట, సనత్‌నగర్ ప్రాథమికోన్నత పాఠశాలలకు కూడా భారీగా విద్యార్థులు
- వారికి కూడా ప్రత్యేక తరగతులు, డిజిటల్ పాఠాల నిర్వహణ
- సర్కారు పాఠశాలల వైపు మొగ్గుచూపుతున్న తల్లిదండ్రులు



రాజ్‌భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల



బేగంపేట పాఠశాలలో అందుబాటులో ఉన్న పాఠ్యపుస్తకాలు..

ప్రభుత్వ పాఠశాల	అడ్మిషన్లు
రాజ్‌భవన్ ప్రాథమికోన్నత పాఠశాల	250
బేగంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల	90
సనత్‌నగర్ ప్రభుత్వ పాఠశాల	110

(రానున్న రోజుల్లో మరింత పెరగనున్న అడ్మిషన్లు)

బేగంపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సర్కారు బడుల్లో విద్యాప్రమాణాలు పెరిగాయి. దీనికితోడు స్వచ్ఛంద, కార్పొరేటర్ సంస్థలు దత్తత తీసుకొని మెరుగైన విద్యాబోధన, సౌకర్యాలను కల్పిస్తుండడం వల్ల ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్థాయిని సంతరించుకుంటున్నాయి. దీంతో అడ్మిషన్‌లు జోరందుకుంటున్నాయి. తల్లిదండ్రులు కూడా మొగ్గుచూపుతున్నారు.

- ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు.. విద్యాబోధన విధానాన్ని విద్యార్థులు సాధించిన మార్కుల వివరాలను తెలుపుతూ ఈనెల 5నుంచి బస్తీలు, కాలనీల్లో బడిబాట నిర్వహించారు. ఇంటికి వెళ్లి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం కూడా అడ్మిషన్లు పెరగడానికి దోహదపడింది.

రాజ్‌భవన్ ప్రభుత్వ పాఠశాలలో..

సోమాజిగూడలోని రాజ్‌భవన్ పాఠశాలకు కొన్ని సంవత్సరాలుగా అడ్మిషన్ల కోసం విద్యార్థులు భారీగా వస్తున్నారు. దీనిని సైయెంట్ అనే స్వచ్ఛంద సంస్థ దత్తత తీసుకొని సౌకర్యాలు కల్పించింది. ప్రత్యేక టీచర్లను ఏర్పాటు చేసి బోధన చేయిస్తోంది. కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసి శిక్షణను ఇప్పిస్తోంది. దీంతో ఈ సంవత్సరం పదవతరగతి ఫలితాల్లో 97శాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు 21 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారు. నగరంలోనే ప్రభుత్వ పాఠశాలల్లో రాజ్‌భవన్ స్కూల్ టాప్‌లో నిలిచింది. రాజ్‌భవన్‌లోని ప్రైమరీ పాఠశాలలో ఇప్పటికే 200కు పైగా కొత్త అడ్మిషన్లు వచ్చాయి. ఉన్నత పాఠశాలలో అయితే 50కి పైగా వచ్చాయి. ఈ సంఖ్య పెరిగే అవకాశాలున్నాయని ఇన్‌చార్జి హెచ్ఎం గోపాల్ తెలిపారు.

సనత్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో..

సనత్‌నగర్ డివిజన్‌లోని రౌండ్‌టేబుల్ సనత్‌నగర్-1 ప్రాథమికోన్నత పాఠశాలలో ఇప్పటి వరకు 110 అడ్మిషన్లు వచ్చాయి. ఇటీవల బస్తీలు, కాలనీల్లో ఉపాధ్యాయులు బడిబాట నిర్వహించి పిల్లలు సాధించిన ఉత్తీర్ణత ప్రమాణాలను వివరించారు. మరో నెల రోజులపాటు మరో వందకు పైగా అడ్మిషన్లు వచ్చే అవకాశాలు ఉన్నాయని ప్రైమరీ, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బ్రహ్మచారీ, మేరీ తెలిపారు.

బేగంపేట పాఠశాలలో..

బేగంపేటలోని ప్రైమరీ, ఉన్నత పాఠశాలల్లో 90 వరకు అడ్మిషన్లు వచ్చాయి. పాఠశాలల్లో విద్యాప్రమాణాలు పెంచడంతోపాటు డిజిటల్ పాఠాలు, ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించడం వల్లే ప్రభుత్వ పాఠశాలల వైపు తల్లిదండ్రులు మొగ్గుచూపుతున్నారు. యూనిఫాంలు, నోట్, పాఠ్యపుస్తకాలు అందుబాటులో ఉన్నాయి.



శివశివానీ డిగ్రీ కళాశాలను ప్రారంభోత్సవంలో నిరంజన్‌రెడ్డి

సాంకేతిక విద్యను అందిపుచ్చుకోవాలి

- రాజ్యసభ సభ్యుడు నిరంజన్‌రెడ్డి

బంజారాహిల్స్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యను అందిపుచ్చుకున్నప్పుడే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని రాజ్యసభ సభ్యుడు ఎస్.నిరంజన్‌రెడ్డి అన్నారు. సోమాజిగూడలో శివశివాని గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ నూతన శాఖను ఆదివారం ఆయన మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే వై.శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావ్యవస్థలో అనేక మార్పులు వస్తున్నాయని, వీటికి అనుగుణంగా బోధనలు జరగాలని అన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఎస్.హారతి, ఎస్పీ సంపతి, సోమాజిగూడలోని శివశివాని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి. సారికా రాజ్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మకుమారీలపై చర్యలు తీసుకోవాలి

పంజాగుట్ట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): భక్తి, సేవ ముసుగులో అమాయకులను మోసం చేస్తున్న బ్రహ్మకుమారీలపై చర్యలు తీసుకోవాలని నిరంకార శివ పరమాత్మ ఆధ్యాత్మిక విద్యాలయం, పలు హిందూ సంఘాలు, సంస్థల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విద్యాలయం నిర్వాహకురాలు మంజుల, హిందూ జేఏసీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, రాష్ట్రీయ హిందూ పరిషత్ అధ్యక్షుడు మండల భూపాల్, పలువురు బాధితులు మాట్లాడారు. బ్రహ్మకుమారీలు అమాయకులను మోసం చేసి వివిధ రూపాల్లో వారి నుంచి డబ్బులు లాగుతున్నారని ఆరోపించారు. సమావేశంలో వివిధ ప్రాంతాలకు చెందిన వెంకట్‌రెడ్డి, శ్రీరామ్, నిర్మల, అంకిత, హిందూ జేఏసీ సంయుక్త కార్యదర్శి నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

ఐదో అంతస్తుపై నుంచి పడి కార్మికుడి దుర్మరణం

బోరబండ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఐదో అంతస్తులో పనిచేస్తున్న కార్మికుడు ప్రమాదవశాత్తు కిందపడడంతో మృతిచెందాడు. ఈ సంఘటన బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కార్మికనగర్‌లో శనివారం జరిగింది. పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిస్సా పర్లాకిమిడి ప్రాంతానికి చెందిన కైలాష్ ప్రధాన్(26) రహ్మత్‌నగర్ డివిజన్ కార్మికనగర్‌లో భార్య దీప ప్రధాన్‌తో కలిసి నివసిస్తున్నాడు. భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. కార్మికనగర్‌లో పెయింటింగ్ కాంట్రాక్టర్ జంగయ్యకు చెందిన ఇంటి ఐదో అంతస్తులో పనిచేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు పక్కభవనం రెండో అంతస్తుపై పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతడిని హుటాహుటిన సనత్ నగర్ సెయింట్ థెరిస్సా ఆస్పత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు కాగా, ఈ దంపతులకు 10 రోజులు క్రితమే కుమారుడు జన్మించాడు. మృతుడి కుటుంబసభ్యులు బోరబండ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో వివాహిత ఆత్మహత్య

బోరబండ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం కారణంగా ఓ వివాహిత ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక బసవకల్యాణ్‌కు చెందిన బుష్రాబేగం(35)కు ఎర్రగడ్డ నటరాజ్‌నగర్‌కు చెందిన ఎండీ హాసింఅలీతో గతేడాది మే 31న వివాహమైంది. మేలో పీసీఓడీ సర్జరీ అయింది. శనివారం రాత్రి బెడ్‌రూమ్ నుంచి బయటకు వచ్చిన బుష్రాబేగం భర్తను లోపలే ఉంచి గడియపెట్టింది. మరో గదిలోపలికి వెళ్లి గడియ పెట్టుకొని ఫ్యాన్‌కు ఉరేసుకుంది. హాసింఅలీ తన స్నేహితుడికి సెల్‌ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. వెంటనే 100కు డయల్ చేయగా, పోలీసులు వచ్చి మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతురాలి తల్లి షమీమ్‌బేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీ.. వాహనదారుడికి గాయాలు

యూసుఫ్‌గూడ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగ్గయ్యపేటకు చెందిన బాలాజీ ప్రైవేట్ ఉద్యోగి. రహ్మత్‌నగర్‌లో నివసిస్తున్నాడు. ఈనెల 14న తన ద్విచక్ర వాహనంపై రహ్మత్‌నగర్ నుంచి హిమాయత్ నగర్‌కు బయలుదేరాడు. నిమ్స్ మే సమీపంలో వెనక నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు(ఏపీ29జెడ్2013) ఢీకొట్టింది. దీంతో బాలాజీకి గాయాలయ్యాయి. వాహనం నుజ్జునుజ్జు అయింది. ప్రాథమిక చికిత్స అనంతరం బాలాజీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పెళ్లి చేసుకుంటానని జూనియర్ ఆర్టిస్టుతో సహజీవనం

బంజారాహిల్స్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని నమ్మించి జూనియర్ ఆర్టిస్ట్‌తో సహజీవనం చేసి ముఖం చాటేసిన జిమ్ ట్రైనర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. కృష్ణానగర్‌లో నివసించే యువతి(27) జూనియర్ ఆర్టిస్టుగా పనిచేస్తుంది. కొంతకాలం క్రితం జిమ్ ట్రైనర్ కాగితాల మహేష్‌తో పరిచయం ఏర్పడింది. ప్రేమిస్తున్నానని నమ్మించాడు. పెళ్లి చేసుకుంటానని చెప్పి రెండు సంవత్సరాలపాటు గాయత్రిహిల్స్‌లో సహజీవనం చేశాడు. యువతి పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి తేవడంతో ముఖం చాటేశాడు. ఇటీవల అతడు కృష్ణానగర్‌లో కనిపించడంతో యువతి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మహేష్‌ను రిమాండ్‌కు తరలించారు.

తక్కువ ధరకు కెమెరాలు ఇప్పిస్తానంటూ మోసం

బంజారాహిల్స్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తక్కువ ధరకే కెమెరాలు ఇప్పిస్తానంటూ మోసం చేసిన డీజే ఆపరేటర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. కృష్ణానగర్‌కు చెందిన దనాల సూరజ్ ఈవెంట్స్‌లో డీజే ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. లేటెస్ట్ కెమెరాలు ఇప్పిస్తానని నమ్మించి ఫోటోగ్రాఫర్ల వద్ద డబ్బులు తీసుకొని మోసం చేస్తుంటాడు. కృష్ణానగర్‌కు చెందిన ఓ వ్యక్తి వద్ద రెండు లక్షల కెమెరా రూ.20 వేలకే ఇప్పిస్తానంటూ డబ్బు తీసుకొని ముఖం చాటేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి సూరజ్‌ను అదుపులోకి తీసుకున్నారు. గతంలో సూరజ్‌ను గజ్వేల్ పోలీసులు కూడా అరెస్టు చేసినట్టు తేలింది. పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.



ప్రజాభవన్‌లో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్న తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.రత్నాకర్‌రావు, జనరల్ సెక్రటరీ పి.సదానందం, విద్యాసాగర్, పవన్‌కుమార్, మల్లయ్య తదితరులు.
- హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి



విజయోత్సవ వేడుకల్లో బాలరాజు, శాస్త్రినగర్ బస్తీవాసులు

శాస్త్రినగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా బాలరాజు

బంజారాహిల్స్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ డివిజన్ శాస్త్రినగర్ సంక్షేమ సంఘం అధ్యక్ష పదవికి ఆదివారం జరిగిన ఎన్నికల్లో బాలరాజు అధ్యక్షుడిగా గెలుపొందారు. మొత్తం బస్తీలో 144 ఓట్లు ఉండగా, బాలరాజుకు 92 ఓట్లు, సమీప అభ్యర్థి సత్యనారాయణకు 52 ఓట్లు వచ్చాయి. 40 ఓట్ల మెజారిటీతో బాలరాజు గెలుపొందినట్లు ఎన్నికల అధికారి నర్సింగ్‌రావు ప్రకటించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ బస్తీ అభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. అనంతరం నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో స్థానిక నాయకులు దూడల రవిగౌడ్, రమేష్ నాయక్, వెంకటేష్‌గౌడ్, విఠల్, ప్రకాష్, సత్యనారాయణ, హరికృష్ణ, జ్యోతిబాయ్, పోస్పాల్, శ్రీకృష్ణ, రవి, ఆంజనేయగౌడ్, వెంకటేష్, స్వర్ణలత పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న కళాకారులు

ఆకట్టుకున్న వారాంతపు సాంస్కృతిక ప్రదర్శన

హైటెక్‌సిటీ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనలో భాగంగా ఆదివారం శిల్పారామంలో కళాకారులు ప్రదర్శించిన భరతనాట్యం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. బెంగళూరుకు చెందిన ఐశ్వర్య ఎం నాయర్ తన ప్రదర్శనలో కౌతం, శంకర శ్రీగిరి, శివకామ సుందరి అంశాలను తమ నాట్యంతో మెప్పించారు. అనంతరం రుహాణి కూచిపూడి డ్యాన్స్ అకాడమీకి చెందిన కల్పన శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలో మహాగణపతి, కొలువైతివా రంగసాయి, భాగ్యదాలక్ష్మి, అచ్యుతం కేశవం, శివస్తుతి, జనుత శబ్దం, భామాకలాపం అంశాలను హారిక, శారద, రాజేశ్వరి, దీప్తి, శిరీష, మోక్ష, ఆద్యరావు, సితార, దేవిక, భవ్యశ్రీ, శ్రీతన్వి, ఈషా, నేహ, అపూర్వ తదితరులు తమ నృత్య ప్రదర్శనతో అందరినీ అలరించారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

పంజాగుట్ట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ రీసెర్చ్ సెంటర్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవా సంఘం, జై జవాన్ జై కిసాన్ యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రేమ్‌నగర్ బస్తీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చింది. రక్త పరీక్షలు చేశారు. ఆర్థోపెడిక్, జనరల్ ఫిజీషియన్, స్త్రీ, ప్రసూతి సంబంధిత, చిన్నపిల్లల వైద్యులు శిబిరంలో పాల్గొన్న వారిని పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో క్యాంపు కో-ఆర్డినేటర్ నితిన్ సింగ్, స్థానిక పంచాయతీ కమిటీ మాజీ చైర్మన్ వెంకటేశం, బస్తీ ప్రధాన కార్యదర్శి భగవాన్‌దాస్, జి.రామచందర్, జి.సుధీర్ కుమార్, కె.ఆర్.నర్సింగరావు, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

రాజీవ్‌నగర్ కాలనీ అభివృద్ధికి 'మాగంటి' కృషి

బంజారాహిల్స్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాజీవ్‌నగర్ కాలనీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఎంతో కృషి చేశారని రాజీవ్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు పీఎస్‌జీ కృష్ణశర్మ అన్నారు. ఆదివారం కాలనీలోని కమ్యూనిటీ హాల్లో మాగంటి సంతాపసభ నిర్వహించారు. కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగా మాగంటి కృషి వల్లే రాజీవ్‌నగర్ కాలనీకి స్వచ్ఛ హైదరాబాద్‌లో భాగంగా క్లీన్ అండ్ గ్రీన్ కాలనీగా అవార్డు లభించిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వినయసాగర్, సభ్యులు, కాలనీవాసులు పీఏఎస్ మూర్తి, రాంబాబు, బద్రుద్దీన్, ముసలి నాయుడు, చంద్రశేఖర్‌రెడ్డి, మోహన్‌రావు, సత్యనారాయణ, భుజంగరావు, చంద్రశేఖర్, సయ్యద్ నజీర్, విజయానంద్, జగదీశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాగంటి గోపీనాథ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కృష్ణశర్మ తదితరులు

కేబీఆర్ పార్కును సందర్శించిన అటవీ అధికారి

హైదరాబాద్ సిటీ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కాసుబ్రహ్మానంద రెడ్డి(కేబీఆర్) పార్కును అటవీ దళాల ప్రధాన సంరక్షాధికారిణి డా.సువర్ణ ఆదివారం సందర్శించారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో కలిసి పార్కులో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో తలెత్తే ఇబ్బందుల నేపథ్యంలో అక్కడక్కడ రెయిన్ షెడ్ల నిర్మాణం చేపట్టాలని వాకర్స్ కోరడంతో జాతీయ పార్కుల్లో నిర్మాణ పనులు చేపట్టాలంటే కొన్ని నిబంధనలు పాటించాలని వాటికి అనుకూలంగా తాము నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ప్లాస్టిక్ వస్తువులు పార్కు లోపలకు అనుమతించకూడదని, అవగాహన కోసం అందుకు సంబంధించిన బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. నెమళ్లు, పావురాలకు ఆహార పదార్థాలను బయట నుంచి అనుమతించ వద్దన్నారు. కుక్కల బెడద ఎక్కువగా ఉందని వాకర్స్ చెప్పగా, జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ, ఇతర ఉన్నతాధికారులతో పాటు వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



కేబీఆర్ పార్కు వద్ద వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో అటవీ దళాల ప్రధాన సంరక్షాధికారిణి డా.సువర్ణ

స్నేహితులను కలుసుకునేందుకు విదేశాల నుంచి..

- సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

హైదరాబాద్ సిటీ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ ఆదర్శ్ నగర్‌లో ఉన్న గాయత్రి గ్రామర్ హైస్కూల్ 1999-2000 పదవ తరగతి బ్యాచి విద్యార్థులు సిల్వర్‌జూబ్లీ వేడుకలు చేసుకున్నారు. బంజారా హిల్స్ తాజ్ డెక్కన్ హోటల్‌లో జరిగిన ఈ వేడుకలకు పలువురు పూర్వ విద్యార్థులు విదేశాల నుంచి వచ్చారు. పాతికేళ్ల తర్వాత కలుసుకోవడంతో వారంతా ఉబ్బితబ్బిబ్బయ్యారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ విలువలతో జీవించాలని, భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిచ్చేలా బతకాలని సూచించారు. సందడిగా సాగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ అలివేలు మంగతాయారుతో పాటు ఉపాధ్యాయులను విద్యార్థులు సత్కరించారు. గురువులు అందించిన విద్య వల్లే తామంతా ఉన్నత స్థితులకు చేరుకున్నామంటూ పూర్వ విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు. 1999-2000లో తమకు ఆయాగా సేవలందించిన మహిళకు నగదు బహుమతి ఇచ్చారు. కార్యక్రమంలో 65 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



సిల్వర్ జూబ్లీ వేడుకలు చేసుకున్న గాయత్రి గ్రామర్ హైస్కూల్ 1999-2000 పదవతరగతి బ్యాచి విద్యార్థులు

నిజాం కాలం నాటి నుంచి సుగంధ ద్రవ్యాలకు ప్రాముఖ్యం

- యూసుఫ్‌బాయ్

బంజారాహిల్స్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సంస్కృతిలో పర్ఫ్యూమ్ అనేది వందల సంవత్సరాలుగా ఉందని దుబాయ్‌కి చెందిన ప్రముఖ పెర్ఫ్యూమర్ యూసుఫ్ బాయ్ తెలిపారు. తొలిసారిగా ఆయన హైదరాబాద్‌కు వచ్చిన సందర్భంగా తాజ్ కృష్ణ హోటల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 22న బంజారాహిల్స్‌లో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన పర్ఫ్యూమ్‌లతో ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. భారత్‌లో ప్రతి ఏటా సుగంధ ద్రవ్యాల కోసం రూ.10 వేల కోట్లు ఖర్చు పెడుతున్నారని, మరో ఐదేళ్లలో రూ.20 వేల కోట్లకు అది పెరుగుతుందని అన్నారు. ఐదేళ్లలో పదివేల మంది పర్ఫ్యూమ్ రంగంలో ఉపాధి అవకాశాలు పొందనున్నారని తెలిపారు. కార్యక్రమంలో యూసుఫ్ బాయ్ సంస్థ ఫౌండర్ చైర్మన్ అబ్దుల్ జలాల్, బిలాల్ అబ్దుల్, అతీఫ్, ముజాహిద్ అహ్మద్ పాల్గొన్నారు.

రగ్బీ ప్రీమియర్ లీగ్‌లో హైదరాబాద్ జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): దేశంలో తొలిసారిగా జరుగుతున్న జీఎంఆర్ రగ్బీ ప్రీమియర్ లీగ్ (ఆర్‌పీఎల్)లో హైదరాబాద్ హీరోస్ జట్టు బరిలోకి దిగుతోంది. ఈ లీగ్‌లో స్వదేశీ, ఆటగాళ్లతో పాటు విదేశీ ప్లేయర్లు కూడా బరిలోకి దిగుతున్నారు. హైదరాబాద్ కెప్టెన్‌గా ఇమాన్యుయెల్, వైస్ కెప్టెన్‌గా ఖత్రి నియమితులయ్యారు. ఖత్రి భారత రగ్బీ జట్టుకు గతంలో సారథిగా వ్యవహరించడం విశేషం. హైదరాబాద్‌కు చెందిన జావేద్, సంవిత్, సుకుమార్, సుమిత్, జోజి, కెవిన్ ఈ పోటీల్లో బరిలోకి దిగుతున్నారు. సోమవారం నుంచి ఈ పోటీలు జరగనున్నాయి. కళింగ బ్లాక్ టైగర్స్‌తో హైదరాబాద్ తొలి మ్యాచ్ జరగనుంది.



ఖత్రి

కుస్తీ పోటీల్లో సత్తాచాటిన బల్కంపేట చిన్నోడు

అమీర్‌పేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి రెజ్లింగ్(కుస్తీ) పోటీల్లో బల్కంపేటకు చెందిన గౌలికార్ మణికంఠ(14) స్వర్ణ పతకం సాధించి సత్తా చాటాడు. బల్కంపేట వీరహనుమాన్ వ్యాయామశాలలో శిక్షణ పొందిన మణికంఠ శనివారం యాకుత్‌పురలోని అలీ అకాడమీలో జరిగిన కుస్తీ పోటీల్లో పాల్గొన్నారు. 75 కిలోల విభాగంలో అవలీలగా పతకం సాధించారు. బల్కంపేట వీర హనుమాన్ వ్యాయామశాల పేరును మరోమారు ఖ్యాతి గడించేలా చేసిన మణికంఠపై పలువురు ప్రశంసల జల్లు కురిపించారు. తమ కుమారుడు చిన్నతనంలోనే బంగారు పతకం సాధించడం పట్ల గౌలికార్ నరేష్ దంపతులు సంతోషం వ్యక్తం చేశారు.



స్వర్ణ పతకంతో మణికంఠ

మలబార్ గోల్డ్ షాప్‌లో చోరీ

- ఆరు గ్రాముల నకిలీ ఉంగరం పెట్టి పరార్

పంజాగుట్ట, జూన్ 15 ఆంధ్రజ్యోతి): సోమాజిగూడ మలబార్ నగల దుకాణానికి వచ్చిన ఓ జంట సిబ్బంది కళ్లుగప్పి సుమారు రూ.60 వేల విలువ చేసే బంగారు ఉంగరం కాజేశారు. అసలు ఉంగరం స్థానంలో నకిలీ ఉంగరం పెట్టి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పంజాగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 31న మలబార్ నగల దుకాణానికి ఓ యువతియువకుడు వచ్చారు. బంగారు ఉంగరం కావాలని అడిగారు. దుకాణం సిబ్బంది వారికి వివిధ శ్రేణుల్లో బంగారు ఉంగరాలు చూపించారు. సిబ్బంది దృష్టి మరల్చి ఆరు గ్రాముల బంగారు ఉంగరాన్ని దొంగిలించారు. దాని స్థానంలో తమ వద్ద ఉన్న నకిలీ ఉంగరాన్ని పెట్టి అక్కడి నుంచి వెళ్లిపోయారు. షోరూంలోని అన్ని నగల ఆడిటింగ్ నిర్వహించగా బంగారు ఉంగరం బరువులో తేడా వచ్చింది. దీంతో సిబ్బంది దానిని క్షుణ్ణంగా పరిశీలించగా అది నకిలీది అని తేలింది. సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించగా 31న వచ్చిన యువతీ, యువకుడు బంగారు ఉంగరాన్ని కొట్టేసి దాని స్థానంలో నకిలీ ఉంగరం పెట్టినట్టు గమనించారు. ఈనెల 14వ తేదీ రాత్రి షోరూం సిబ్బంది పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్నారు. ఈ దొంగతనం జరిగిన ఘటనలో సిబ్బంది ఎవరైనా వారికి సహకరించారా? అని ఆరా తీస్తున్నారు. ఆదివారం పోలీసులు షోరూంను సందర్శించి వివరాలు సేకరించారు.



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఈఓ మహేందర్‌గౌడ్

ఎమ్మెల్యేను కలిసిన ఆలయ ఈఓ

మారేడుపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : అందరి సమన్వయంతో బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కల్యాణం ఏర్పాట్లు చేయాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బల్కంపేట ఎల్లమ్మ ఆలయం నూతన ఈఓగా బాధ్యతలు చేపట్టిన మహేందర్ గౌడ్ ఆదివారం వెస్ట్ మారేడుపల్లిలోని నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేను నూతన ఈఓ శాలువా, పూలమాలతో సత్కరించి ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన ఈఓకు శుభాకాంక్షలు తెలిపారు. జూలై 1వ తేదీన నిర్వహించే బల్కంపేట ఎల్లమ్మ కల్యాణంకు లక్షలాది మంది భక్తులు వస్తారని, అందుకు తగినట్లు ఏర్పాట్లు జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈఓ వెంట ఆలయ ట్రస్ట్ చైర్మన్ సాయిబాబా ఉన్నారు.

తిరుమలగిరి విలేజ్‌లో ఉర్సు



దర్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న నిర్వాహకులు

తిరుమలగిరి జూన్ 15(ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి విలేజ్‌లోని ఫుట్‌బాల్ గ్రౌండ్ సమీపంలో ఉన్న హజరత్ గరీబ్ షాహ్‌వాలి ఉర్సు కన్నుల పండువగా జరిగాయి. దర్గాపై పూల చాదర్ సమర్పించి ప్రార్థనలు నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు విచ్చేసి ఉత్సవాల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు జే.తెలసీరాం, మహ్మద్ ఇబ్రహీం, మహ్మద్ హనీఫ్, గోపాల్, జార్జ్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న జంపన ప్రతాప్

ఆలయ అభివృద్ధికి కృషి: జంపన

బోయినపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : కంటోన్మెంట్ ఒకటో వార్డు కడక్‌పుర, కృష్ణారెడ్డినగర్‌లోని శ్రీ సిదిధాత్రి, దుర్గ భవాని దేవాలయ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అన్నారు. ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు ఆదివారం ఆలయాన్ని సందర్శించిన ఆయన కమిటీ సభ్యులతో కలిసి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు జంపన ప్రతాప్‌తో కలిసి ఆలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ గోపురం నిర్మాణం కోసం సహకరించాలని కమిటీ సభ్యులు ఆయనను కోరారు. సానుకూలంగా స్పందించిన ఆయన ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని, దాతలు కూడా ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, శశి, కిట్టు, రాకేష్, శ్రీకాంత్, ముఖేష్ యాదవ్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న సంతోష్ కుమార్, స్పోర్ట్స్ అధికారి శ్రీనివాస్

అందుబాటులోకి ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్

రెజిమెంటల్‌బజార్,జూన్ 15(ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటుతో పాటు వాకింగ్ ట్రాక్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిర్రబోయిన సంతోష్ యాదవ్ తెలిపారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ప్రత్యేక శ్రద్ధతో రెజిమెంటల్‌బజార్‌లో ఉన్న జీహెచ్‌ఎంసీ పార్క్ బస్తీవాసులు ఉపయోగించుకునేలా అందుబాటులోకి రానుందని తెలిపారు. ఆదివారం ఎమ్మెల్యే ఆదేశాలతో సంతోష్‌యాదవ్ స్పోర్ట్స్ అధికారి శ్రీనివాస్‌తో కలిసి పార్కులో ఓపెన్ జిమ్ పరికరాలు ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు.



టీఆర్ఎల్‌డీ మహిళా నాయకురాళ్లతో జయంత్ సింగ్ చౌదరి, చారు సింగ్ చౌదరి

మహిళలు రాజకీయంగా ఎదగాలి

పద్మారావునగర్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కవాడిగూడలోని అన్నం కాంప్లెక్స్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన రాష్ట్రీయ లోక్‌దళ్ నేషనల్ ఉమెన్ సెమినార్ జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన జూకీ నేషనల్ సెమినార్ వ్యవస్థాపకురాలు చారు సింగ్ చౌదరి మాట్లాడుతూ కుటుంబంలో మహిళలు అభివృద్ధి చెందితే సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. అన్ని రంగాలలో మహిళలు ఎదుగుతున్నప్పటికీ రాజకీయంగా ఎదగాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. ఆర్ఎల్‌డీ జాతీయ మహిళా అధ్యక్షురాలు ఇందిర పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

పోగొట్టుకున్న బ్యాగు అప్పగింత



ప్రయాణికుడికి బ్యాగ్ అప్పగిస్తున్న ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ సురేష్ కుమార్

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి) : రైల్వేస్టేషన్‌లో మరిచిపోయిన విలువైన వస్తువులు ఉన్న బ్యాగును హైద్రాబాద్ ఆర్పీఎఫ్ పోలీసులు ప్రయాణికుడికి అప్పగించారు. నాంపల్లి ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కల్పన తెలిపిన వివరాల ప్రకారం ముంబయ్‌కి చెందిన వరుణ్ ఠాకూర్ ఆదివారం ముంబయ్ నుంచి బేగంపేట్ రైల్వేస్టేషన్‌లో తన దగ్గర ఉన్న బ్యాగ్‌లతో రైలు దిగాడు. ఆ తర్వాత ఒక బ్యాగు కనిపించకపోవడంతో బాధితుడు అక్కడ విధులు నిర్వహిస్తున్న ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ సురేష్, బాధితులు కలిసి దిగినచోట వెతికినప్పటికీ బ్యాగ్ దొరకపోవడంతో రైలులో గాలించగా బెర్తు వద్ద ఉన్న బ్యాగ్‌ను వెతికి స్వాధీనం చేసుకున్నారు. బ్యాగులో లాప్‌టాప్‌తో పాటు రూ.33,500 విలువ చేసే వస్తువులు ఉండగా ప్రయాణికుడికి బ్యాగును అప్పగించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రైలు దిగే ముందు ప్రయాణికులు ఎప్పటికప్పుడు తమ బ్యాగులను సరిచూసుకోవాలని ఏదైనా ఆపద వస్తే 139 నంబరుకు సమాచారం ఇస్తే క్షణాల్లో చేరుకుంటామని ప్రయాణికులకు సూచించారు.

బడి గంటలు మోగిన తొలి ఆదివారం.. మార్కెట్లు కళకళ



చిన్నా! ఈ బ్యాగ్ ఓకేనా: కుమారునితో తల్లి



వీటిలో ఏ బ్యాగ్ సెలక్ట్ చేసుకోవాలబ్బా: ఆలోచనలో చిన్నారి




ఈ యూనిఫారంలో అచ్చం బుట్టబొమ్మలా ఉన్నానా? తల్లితో ఆనందంగా చిన్నారి



ఈ యూనిఫారమ్.. మీ పాపకు అదిరిపోతుంది: తల్లిదండ్రులతో దుకాణపు సిబ్బంది

సికింద్రాబాద్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): బడి గంటలు మోగి, పాఠశాలలు తెరుచుకున్న మొదటి ఆదివారం సికింద్రాబాద్‌లోని మార్కెట్లు కళకళలాడాయి. నిన్న, మొన్నటి వరకు పిల్లల అడ్మిషన్ల కోసం ఆరాటపడిన తల్లిదండ్రులు.. తాజాగా పాఠ్య, నోట్ పుస్తకాలు, బ్యాగులు, వాటర్ బాటిళ్లు, యూనిఫారాల కొనుగోలుపై పడ్డారు. ఆదివారం సెలవు కావడంతో పిల్లలతోపాటు తల్లిదండ్రులు సికింద్రాబాద్‌లోని మోండా మార్కెట్, జనరల్‌బజార్, పాలికాబజార్ తదితర ప్రాంతాలకు చేరుకున్నారు. పిల్లలకు అవసరమైన పుస్తకాలు, బ్యాగులు, యూనిఫారాలు, బూట్లు, వాటర్ బాటిళ్ల దుకాణాల వద్ద బారులు తీరారు. గత ఏడాదితో పోలిస్తే వాటి ధరలు కాస్త పెరిగినప్పటికీ కొనుగోలు చేయకతప్పని స్థితి తల్లిదండ్రులకు తప్పలేదు. మొత్తానికి ఈ ఆదివారం తల్లిదండ్రులు, చిన్నారులతో సికింద్రాబాద్‌లోని మార్కెట్లు కళకళలాడాయి.



పుస్తకాలు పట్టుకునేందుకు రెండు చేతులు సరిపోవడంతో రశీదును నోట్లో పెట్టుకుని బైక్ వద్దకు వెళుతున్న వ్యక్తి

కిటకిటలాడిన మహంకాళి ఆలయం

సికింద్రాబాద్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. త్వరలో బోనాల జాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇప్పటినుంచే ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ఆదివారం కొందరు భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



అమ్మవారికి బోనాలు సమర్పించిన భక్తులు



మహ్మద్‌గూడ ప్రధాన రహదారిపై పొంగుతున్న మురుగునీరు

మహ్మద్‌గూడలో పొంగుతున్న మురుగు

బౌద్ధనగర్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ మహ్మద్‌గూడ ప్రధాన రహదారిపై నిత్యం మురుగు పొంగుతుంది. గతంలో కొన్ని లక్షల రూపాయలు వెచ్చించి సీవరేజీ పైపులైన్లు వేసినా ఫలితం లేదు. దీంతో నిత్యం మ్యాన్‌హోల్స్ నుంచి మురుగు లీకై ప్రధాన రహదారితో పాటు ఇళ్లలోకి వెళుతోంది. దీంతో ఆ దారిన రాకపోకలు సాగించాలంటే వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజు సిబ్బంది వచ్చి తాత్కాలిక మరమ్మత్తులు చేస్తున్నారు. మరలా యథావిధిగా మురుగు రోడ్లపైకి వస్తుందని స్థానికులు వాపోతున్నారు. శాశ్వతంగా మురుగు రాకుండా సమస్యను పరిష్కారించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి

బౌద్ధనగర్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): వారాసిగూడలో బౌద్ధనగర్ డివిజన్ అధ్యక్షుడు సాయిప్రసాద్‌గౌడ్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన డివిజన్ సంకల్పసభ సమావేశంలో బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రధాని దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని, పేద ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పీఎం చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకవెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ నాయకులు వెంకటరమణి, రాజశేఖర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పి.రవిప్రసాద్‌గౌడ్ నాయకులు కందాడి నాగేశ్వరరెడ్డి, కనకట్ల హరి, దత్తు, నేతీసత్యనారాయణ, లడ్డూ, సారది, సంపత్, కొమరయ్య, సుదాకర్ తదితరులు పాల్గొన్నారు.

రేసింగ్‌లో సాయిదీప్‌కు అగ్రస్థానం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఉత్తర అమెరికా రేసింగ్ చాంపియన్‌షిప్ తొలి రెండు రౌండ్లలో సికింద్రాబాద్ రేసర్ ఎం.సాయిదీప్ విజేతగా నిలిచాడు. కాలిఫోర్నియా జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తున్న సాయిదీప్ 400 సూపర్ బైక్ సిరీస్ తొలి రెండు రౌండ్లలో అగ్రస్థానంలో నిలిచాడు. ఫైనల్ రౌండ్ ఈనెల 27న కాలిఫోర్నియాలో జరగనుంది. 2010 నుంచి సాయిదీప్ మోటోజీపీ రేసుల్లో పాల్గొనడం తెలిసిందే.

ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న మాదిగ సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ వెంకటస్వామి మాదిగ

బౌద్ధనగర్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని మాదిగ సోషలిస్ట్ పార్టీ(ఎంఎస్‌పీ) తెలంగాణ రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఇ.వెంకటస్వామి తెలిపారు. ఆదివారం సీతాఫల్‌మండి డివిజన్ మధురానగర్‌కాలనీ జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీ హాలులో హైదరాబాద్ జిల్లా అధికార ప్రతినిధి డప్పు మల్లికార్జున్ మాదిగ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఎస్సీ వర్గీకరణతో పాటు పేద ప్రజల పక్షాన నిలబడి ఎన్నో ఉద్యమాలు చేసిందన్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా చేసుకోవాలని, దండోరా జెండాలను ఆవిష్కరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు టీవీ నర్సింహారావు, జె.మహేష్‌మాదిగ, సి.దేవేందర్, నలిమేల విజయరావు, సత్యనారాయణ, యాదగిరి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్యం మాత్రమే ఉచితంగా అందించాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న నేషనల్ కమిషన్ షెడ్యూల్ ట్రైబ్స్ సభ్యుడు జాతు హుస్సేన్

చిలకలగూడ, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మెట్టుగూడ ఆఫీసర్స్ క్లబ్‌లో ఆదివారం తెలంగాణ రాష్ట్ర యానాది సంక్షేమ సంఘం ఆత్మగౌరవ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జాతీయ షెడ్యూల్ కమిషన్ సభ్యుడు జాతు హుస్సేన్ మాట్లాడుతూ బిహార్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాలు అభివృద్ధి పథంలో పయనిస్తుంటే, మన రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ఉచిత పథకాలతో సోమరులుగా మారుతున్నారని, అందరికి విద్య, వైద్యం మాత్రమే ఉచితంగా అందించాలని సూచించారు. అనంతరం అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఛైర్మన్‌గా ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా ఐ.సాంబశివరావు, కోశాధికారిగాశేషాద్రి. ఈ కార్యక్రమంలో ఐఏఎస్ అధికారి శ్రీధర్, అసోసియేషన్ ఛైర్మన్ ఆంజనేయులు, జాతీయ గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడుపివి. రమణ తదితరులు పాల్గొన్నారు.

పంచరత్న కీర్తనల పరిమళాలు నిత్య నూతనం

చిలకలగూడ, జూన్ 15(ఆంధ్రజ్యోతి): శ్రీ చంద్రశేఖరేంద్ర సంగీత ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో వెస్ట్ మారేడుపల్లి, కళాసాగర్, మీనాక్షి సుందరం హాల్‌లో కంచి పరమాచార్య చంద్రశేఖరేంద్ర స్వామి, వాగ్గేయకారుడు త్యాగరాజ స్వామి జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం త్యాగరాజ పంచరత్న కీర్తనల గోష్ఠిగానం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సంగీత విద్వాంసుడు నల్లాన్ చక్రవర్తుల బుచ్చయ్యాచార్యులు విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ పంచరత్న కీర్తనల పరిమళాలు నిత్యనూతనమని పేర్కొన్నారు. గాయనీ గాయకులు, వాద్య కళాకారులు అయ్యగారి శ్యాంసుందర్, హరిప్రియ, శ్వేతా ప్రసాద్, మందా అనంతకృష్ణలను శాలువ, జ్ఞాపికలతో సత్కరించారు. సాయంత్రం సంగీత కళారత్న డాక్టర్. పి.శ్రీనివాస గోపాలన్ మృదంగం-మోర్సింగ్ వాద్య కచేరీ ఆకట్టుకుంది. సొసైటీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ వందన సమర్పణ గావించాడు.



రక్తదాన శిబిరం

కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి జన్మదినం సందర్భంగా బీజేపీ తార్నాక డివిజన్ అధ్యక్షుడు బండారి ఉపేందర్ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం లాలాపేట్‌లోని ప్రొ.జయశంకర్ స్టేడియం ఆవరణలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా మహంకాళి అధ్యక్షుడు గుండగోని భరత్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు శ్యాంసుందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, అసెంబ్లీ కన్వీనర్ కందాడి నాగేశ్వర్ రెడ్డి, మద్దర్ల శ్యామ్ సుందర్, వేణు యాదవ్, వెంకటేశ్ గౌడ్, పోచయ్య యాదవ్, ప్రకాష్ గౌడ్, వీరన్న, శ్రీనివాసా చారి, సుక్క గణేష్ ముదిరాజ్, రాముపర్మ, అనిత, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

- తార్నాక, ఆంధ్రజ్యోతి



ఉచిత వైద్య శిబిరం

టీడీపీ తార్నాక డివిజన్ అధ్యక్షుడు గండికోట విజయ్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం మాణికేశ్వర్ నగర్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఓయూ పోలీస్‌స్టేషన్ సీఐ ఎం.అప్పలనాయుడు, ప్రముఖ సినీనటుడు శివాజీరాజా ముఖ్య హాజరై రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు పి.సాయిబాబా, బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు ఆలకుంట హరి తదితరులు పాల్గొన్నారు.

- తార్నాక, ఆంధ్రజ్యోతి

మర్యాదపూర్వక కలయిక



సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఏఐసీసీ సభ్యులు, మాజీ టీపీసీసీ ఉపాధ్యక్షులు కఠారి గౌరీ శంకర్, గ్రేటర్ హైదరాబాద్ కంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు కఠారి మహేష్ యాదవ్.

- రాంగోపాల్‌పేట్, ఆంధ్రజ్యోతి



సమావేశంలో మాట్లాడుతున్న తేలికుంట సతీష్‌గుప్తా

రాజీవ్ జాతీయ రహదారి బంద్‌కు పిలుపు

సికింద్రాబాద్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఎలివేటెడ్ క్యారిడార్ల నిర్మాణం కోసం ప్రభుత్వం సేకరించనున్న ఆస్తులు, చెల్లించాల్సిన నష్టపరిహారంపై స్పష్టత కోసం జూలై 7న రాజీవ్ జాతీయ రహదారిని బంద్ చేయాలని రాజీవ్ రహదారి ప్రాపర్టీస్ ఓనర్స్ జేఏసీ చైర్మన్ తేలుకుంట సతీష్‌గుప్తా పిలుపునిచ్చారు. ఆదివారం కార్ఖానలోని అనుభవ్ గార్డెన్స్‌లో జరిగిన సమావేశంలో జేఏసీ నాయకులు, పలు ఆస్తుల యజమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సతీష్‌గుప్తా మాట్లాడుతూ ఎలివేటెడ్ క్యారిడార్ల నిర్మాణం కోసం 100 అడుగుల వరకు రోడ్ల విస్తరణ అవసరం లేదని తాము ఎన్ని సార్లు మొర పెట్టుకున్నా వినిపించుకోవడం లేదని అన్నారు. ఆస్తులు కోల్పోయే వారికి ఇచ్చే నష్టపరిహారంపై స్పష్టత రావడం లేదని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై పోరాటానికి దిగకతప్పదని, అందుకే జూలై 7న రాజీవ్ రహదారి బంద్ చేయాలని జేఏసీ నిర్ణయించినట్టు వెల్లడించారు. ప్రవీణ్, కొమరవెల్లి వెంకన్న, గౌరిశెట్టి మునీందర్, భార్గవి, మాజేటి రాజేష్, మనిగండ్ల శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు

మహంకాళి బోనాల జాతరకు ఏర్పాట్లు

తిరుమలగిరి జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఆషాఢమాసం మహంకాళి దేవాలయ బోనాల జాతరను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని దేవాలయ కార్యనిర్వాహక అధికారి సత్యచంద్ర రెడ్డి తెలిపారు. ఆదివారం అమ్మవారి సేవకులు, పుర ప్రముఖులు, భక్తులతో దేవాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవాలయాన్ని మరింత అభివృద్ధి చేస్తున్నామని, భక్తులకు మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం బోనాల జాతర నిర్వహించడానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జూలై 14, 15, 16, 17 తేదీల్లో జాతరను నిర్వహించనున్నట్లు తెలిపారు. దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందించాలని కోరారు. అమ్మవారి సేవకులు, పుర ప్రముఖులు భక్తులు బోనాల జాతర ఏర్పాట్ల గురించి చేసిన సూచనలు, సలహాలు ఈఓ సత్యచంద్రరెడ్డి స్వీకరించారు. కార్యక్రమంలో మురళీ ముదిరాజ్, భక్తవత్సలం, నిరంజన్, మధు, రాజేందర్ సింగ్, మల్లేష్, సదానంద్, శివకుమార్, సుధాకర్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



ఘన్ శ్యామ్ ముదిరాజ్ పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

కాంగ్రెస్ సీనియర్ నాయకుడి ఆకస్మిక మృతి

రాంగోపాల్‌పేట్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : రాంగోపాల్‌పేట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఘన్‌శ్యామ్ ముదిరాజ్ అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కొంత కాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతూ డయాలిసిస్ చేయించుకుంటున్నారు. శనివారం కూడా డయాలిసిస్ చేయించుకొని వచ్చిన తర్వాత ఆరోగ్యం క్షీణించి తన చివరి శ్వాసను వదిలారు. పార్టీలో ఎంతో సీనియర్ కార్యకర్తగా ఉంటూ బీజేపీనేత మర్రి శశిధర్ రెడ్డికి ప్రధాన అనుచరుడిగా, చురుకైన కార్యకర్తగా వ్యవహరించారు. ఆయన మృతి వార్త విన్న సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆయన ఇంటికి చేరుకుని మృతదేహానికి పుష్పమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలిపారు. మాజీమంత్రి మర్రిశశిధర్ రెడ్డి, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీర శ్రీకాంత్, మాజీ కార్పొరేటర్ అతెల్లి మల్లిఖార్జున్ గౌడ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి మాతంగి గణేస్, అంబర్‌పేట్ శంకర్‌లతో పాటు పలువురు ప్రముఖులు ఆదివారం జరిగిన ఘన్‌శ్యామ్ అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేత తల్లికి నివాళి : ఎమ్మెల్యే తలసాని

రాంగోపాల్‌పేట్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : రాంగోపాల్‌పేట్ డివిజన్ ప్రధాన కార్యదర్శి వంజరపు ఆంజనేయులు తల్లి సత్యమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆదివారం దశదిన కర్మ సందర్భంగా కళాసీగూడలోని ఆంజనేయులు నివాసం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరై సత్యమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఎమ్మెల్యే వెంట మాజీ కార్పొరేటర్ అతెల్లి మల్లికార్జున్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు శ్రీహరి, ఆకుల హరికృష్ణ, విజయ్, చందు చారి, దేవేందర్ చారి, నరేష్, ఆరిఫ్ తదితరులు ఉన్నారు.